

# మారకం

రచన :
**మొపాసా**

అనువాదం :
**'శేషబాబు'**

ఆరోజుల్లో భార్యాభర్తలమధ్య విడాకుల్ని ఇప్పించటంలో జాన్ అనే న్యాయవాది సుప్రసిద్ధుడు. ఒకనాటి ఉదయాన ఆయన ఆఫీసు తెరవగానే ఒక క్లైయింట్ సిద్ధంగావున్నాడు. న్యాయవాది ఆయన్ను లోపలికి ఆహ్వానిస్తూనే "కూర్చోండి" అన్నాడు.

క్లైయింట్ కూర్చుంటూనే "విడాకుల సందర్భంలో నాతరఫున వాదించమని కోరేందుకు వొచ్చాను" అన్నాడు.

"చెప్పండి—నేను వింటున్నాను"

"నేను కోర్టులో చిన్న ఉద్యోగం చేసుకునేవాణ్ని. నావయస్సు ముప్పైఏడు సంవత్సరాలు....దురదృష్టవశాత్తు నేను వివాహమాడాను...."

"వివాహంలోని దురదృష్టాన్ని గూర్చి విచారపడటానికి మీరొక్కరేకాదు; చాలా మందివున్నారు!"

"ఆసంగతి నాకు తెలుసు. ఆ దురదృష్టవంతులైన ఇతరులమీద నాకు సానుభూతి వుంది. కాని నాగొడవవేరు. నాభార్యమీద నాకున్న ఫిర్యాదుచాలా చిత్రమైనది. నావివాహంకూడా చాలాచిత్రమైన పరిస్థితుల్లోనే జరిగింది. ప్రమాదకరమైన అభిప్రాయాలంటే మీకేమన్నా నమ్మకం వుందా?"

"అంటే?"

"కొన్ని అభిప్రాయాలున్నవే అవి మనసుకు విషతుల్యమని. విషం శరీరానికి ఎంత ప్రమాదకరమో, కొన్ని అభిప్రాయాలు కూడా మనసుకు అంత ప్రమాదకరంగానూ ఉంటవని"

"సరే....అర్థమైందిలెండి"

"అందుకేమీ సందేహంలేదు. కొన్ని అభిప్రాయాలు మనలో ప్రవేశించి, మనను చిత్రంగా బాధించి, పిచ్చెక్కేట్టుచేసి మెలివేస్తవి; వాటిని అదుకోవటం తెలియకపోతే అవి ఎంత ప్రమాదానికైనా దారితీస్తవి.

ఆత్మకు ఇవి ఒకరకం విషాలనుకోండి. ఏదురదృష్ట వశానో ఇలాటి ఒక్క అభిప్రాయానుసారంగా మనం నడకసాగిస్తే, అదివొక్కటేచాలు మనను తలక్కిందులు చేసేందుకు; ఆ అభిప్రాయం మనమీద దండెత్తిందనే సంగతి తెలియకపోవటంవల్ల, అది మనను ఎన్ని వక్రగతుల్లోకన్నా లాగి, అధఃపాతాళానికి తొక్కేదాకా వొదలదు...."

"అసలు కథ చెప్పండి" అన్నాడు న్యాయవాది. క్లైయింట్ చెప్పనారంభించాడు.

• • •

"నేనేదో చిన్న ఉద్యోగం చేసుకునే వాణ్ని. కటికబీదవాణ్ని కాదుకాని, ఆవొచ్చే దాన్ని ఎంతో పొదుపుగా వాడుకోవాల్సి వొచ్చేది. నా అభిరుచుల్నీ, ఇతర సరదాలనూ చాలా తగ్గించుకోవాల్సి వొచ్చేది. నా యీ వయస్సులో ఇలాటిది కష్టంగానే వుండేది.

వార్తాపత్రికల్లోని ప్రకటల్ని జాగర్తగా చూడటం నాకో సరదాగా వుండేది. పెళ్లి ప్రకటనల విషయాలు నన్ను ఎక్కువగా ఆకర్షించేవి. బాగావీలుగా, వాటంగావున్న పెళ్లి ప్రకటనల్ని నా స్నేహితులకు చెప్పేవాణ్ని. వాళ్ళలో చాలామందికి యీ ప్రకటనలద్వారానే వివాహాలు ఐనవి కూడాను.

ఒకనాడు ఒక ప్రకటన ఇలావుంది: 'ఒక మంచి అందగత్తె. నాగరికతలోనే పెరిగింది. తనతోపాటు 25 లక్షల ఫ్రాంకుల ఆస్థిని తెస్తుంది. ఒక పెద్దమనిషిని వివాహమాడేందుకు సిద్ధంగావుంది. మధ్యవర్తులు అవసరంలేదు.'

ఆరోజునే నేను ఇద్దరు స్నేహితులతో కలిసి భోజనం చేశాను. మాసంభాషణ ఎలా వివాహాలవైపు మళ్లిందో నాకు జ్ఞాపకంలేదు. మధ్యలో నేను నవ్వుతూ ఆ ఉదయమే చూసిన ప్రకటనను గూర్చి చెప్పాను.

"యీ ఆడవాళ్లు ఏమనుకుంటారు?" అన్నాడు ఒక స్నేహితుడు.

రెండో స్నేహితుడు; ఇలాటి ప్రకటనల ద్వారా మంచి మంచి సంబంధాలు స్థిరపడినవి చెవుతూ, ఆ వివరాలు ఇచ్చాడు. ఆతరువాత నాతో ఇలా అన్నాడు: "ఐతే యీ సంబంధాన్ని నువ్వు చూడకూడదా? ఆడబ్బంతావొస్తే నీదరిద్రం తీరుతుందిగా?"

మేము ముగ్గురమూ నవ్వుకున్నాం; ఆతరువాత మేము ఇతర విషయాల్నిగూర్చి మాట్లాడుకున్నాం. ఒక గంట తరువాత నేను ఇంటికి వొచ్చేశాను.

ఆ రాత్రి నాకు పడిసెభారం వొచ్చింది. నేను వుండే ఇల్లు పురాతనమైనది కనుక, అక్కడ సౌఖ్యంలేదు. ఆరాత్రంతా చలిబాధతో యమయాతన పడ్డాను. నాజీవితం మీద నాకెంతో అసహ్యమూ, దుఃఖమూ కలిగినయ్. జీవితం ఎంతో బాధాకరంగానూ, విసుగ్గానూ తోచింది. అనుకున్నాను: ఆపాతికలక్షల ఆస్థి నాకు వుంటే, ఇంత బాధ పడకపోదును కదా!

నాకొంప బావురుమంటూ వుండేది. ఒక వంటమనిషి ఇంటిపనులన్నీ చూస్తూండేది; బ్రహ్మచారిగానే నేను యీ సంవత్సరాలన్నీ గడుపుతున్నాను. ఇంట్లో సరైన ఫర్నిచర్

లేదు సరికదా—చలిబాధ లేకుండా ఒక అగ్నిగుండం కూడాలేదు. సామానంతా చెల్లా చెదురుగా ఇంటినిండా పడివుండేది.

మొదట్లో నేను నా బీదతనాన్ని గూర్చి, ఒక్క ధనసంపాదనే దానికి పరిష్కారమని భావించ సాగాను. పడుకున్నాక కాని— ఆమెను గూర్చిన ఆలోచనలు నాకు రాలేదు. ఆ ఆలోచనలతో రాత్రి చాలా సేపటివరకూ నిద్రరాలేదు.

మర్నాటి ఉదయం నిద్రమెళుకూ రాగానే తొందర పనిమీద వెంటనే డార్నెటాల్‌కు వెళ్లాలని జ్ఞాపక మొచ్చింది. బైట మంచు దట్టంగా పడుతూనేవుంది. చలికి శరీరం కుంచుకొని పోతోంది. ఐనా కూడా నేను బాధపడుతూనే పని మీద వెళ్లితీరాలి.... ఆ పాతిక లక్షలూ వుంటే నాకే బాధ వుండదు; సౌఖ్యమయ జీవితం అందు బాటులోనే వుంటుంది!

పదింటికి తిరిగి ఇంటికి వొచ్చాను. దట్టమైన గబ్బిలాల వాసన, పురాతన వస్తు సామాగ్రి విడుదలచేసే అసహ్యాకరమైన వాసన నన్ను ఆవరించింది. ఎంతో చిరాకు కలిగింది. ఇల్లంటేనే అసహ్యం వేసింది.

భోజనంచేసి పనిలోకి వెళ్ళాను. కాని మనస్సు బాగాలేదు, తిరిగి ఆమెను గూర్చి, ఆమె పాతిక లక్షల ఆస్థిని గూర్చి ఆలోచించ సాగాను. ఆమె ఎవరు? ఆమెకు రాసి వివరాల్ని నేనెందుకు కనుక్కోకూడదు?

కాని నేనా పనిని ఎందుకనో వెంటనే చేయలేక పోయాను. రెండు వారాల వరకూ ఒక నిశ్చయానికి రాలేకపొయ్యాను. నాకిష్ట సుఖాలు ఇన్నాళ్ల వలెనే వున్నవి; కాని ఇంతకు పూర్వం ఆ విషయాలు నన్నింతగా మధనపెట్టి బాధించలేదు. ఇప్పుడు నా బీదరికమే నాకెంతో బాధాకరంగావుంది. ఆబాధ ఎక్కువైన కొద్దీ—ఆమెను గూర్చి, ఆమె పాతిక లక్షల ఆస్థిని గూర్చి, ఆలోచనలు మరింతగా పెరగసాగినవి.

ఆమె చరిత్ర నంతనూ ఊహించుకునే వాణ్ని. మనకు కావలసిన వస్తువును గూర్చి —దాని నిజస్వరూపం ఎలాటిదైనా, మనకు ఎలావుంటే ఇష్టమో, ఆవిధంగా ఊహించుకొని తృప్తిపడతాం. అదేవిధంగా ఆమె చాలా చిన్న వయసులోనే వుంటుందనీ, చాలా అందంగా వుంటుందనీ నాగరికత ఉట్టిపడుతూంటుందనీ—వార్తాపత్రిక ద్వారా భర్తకోసం ప్రయత్నించి వుంటుందనీ, ఆమె మర్యాదస్థుల కుటుంబం లోదే ఐవుంటుందనీ, కాని జీవితం బాధాకరంగా వుండటంవల్ల తనకొక సహచరుడు అవసరమై యీ ప్రకటనను వేసివుంటుందనీ వూహించుకున్నాను.

ఇంత పెద్ద మొత్తం ఒకేసారి వొచ్చిపడుతోందనే విషయం మొదట్లో నన్నంతగా ఆకర్షించలేదు. నా అనుభవంలో ఇలాటి కథల్ని ఎన్నిటినో విన్నాను; ఇలాటి ప్రకటనల్ని అనేకంచూశాను. అదీగాక ఇలాటి వాగ్దానాలు నమ్మదగ్గవి కావనికూడా నాకు తెలుసు. ఐనప్పటికీ ఆ అంకెల్ని నమ్మటం వల్ల కొంత ఆనందం కలుగుతుంది; కనుక నమ్మినట్టుగానే భావించటం జరుగుతోంది.

ఆమె—బహుశా ఏ పెద్ద కుటుంబంలోని తండ్రికీ, ఇంటిదాసీకీ పుట్టి, అతాత్తుగా తన

తండ్రినుంచి ఇంతపెద్ద ఆస్థిని పొందివుంటుంది; తనజన్మరహస్యం తెలియని వ్యక్తిని వివాహమాడి, శేషజీవితం సుఖప్రదం చేసుకునేందుకు ప్రయత్నించి వుంటుంది.

ఇదంతా వొట్టిఊహ ఐనప్పటికీ ఎందుకనో నాకొక పిచ్చినమ్మకం ఏర్పడింది. ప్రణయ ఘట్టాల సంగతి నాకంతగా తెలియకపోయినా, ఏదోవూహించి—నాస్నేహితుడి తరపున రాసినట్టుగా ఒక దరఖాస్తును ఆమెకు పంపుకున్నాను.

ఐదురోజులు గడిచాక నేను పనిచేసుకుంటూండగా ఆమె వొచ్చింది. ఆమె వయస్సు 30. సం. లు, కొంచెం బొద్దుగా, నల్లగా వున్నప్పటికీ ఆకర్షణీయంగానే వుంది. ఆమెకూర్చుంటూనే "నేనే.... ఆమెను" అని గొణిగింది.

"నాకు బాగా అర్థంకాలేదు"

"మీరు ఎవరికైతే పెళ్ళి దరఖాస్తు పంపుకున్నారో ఆమెనే నేను"

"అలాగా !"

"యీవిషయాలన్నీ వ్యక్తిగతంగా నే మాట్లాడుకుందామని వొచ్చాను."

"ఇదేమంచి పద్ధతని నాఅభిప్రాయం.... మీకు పెళ్ళాడటం ఇష్టమే నన్నమాట?" అన్నాను.

"ఔను"

"నీకు కుటుంబంలేదా ?"

ఆమెకాస్త ఆగి, నేలచూపులుచూస్తూ "లేదు. నాతల్లి దండ్రులు చనిపొయ్యారు" అంది.

నాకు ఆశ్చర్యంకలిగింది. కాని ఇదంతా నిజమై వుంటుందని నమ్మేందుకు నాకు ఎక్కువనేపు పట్టలేదు. వెంటనే యీనిర్భాగ్యురాలి మీద నాకు ఏంతో దయ, సానుభూతి కలిగినవి. ఆమె ఏమనుకుంటుందోననే వూహ లేకుండానే "ఆస్థిపాస్తులన్నీ నీస్వాధీనంలోనే ఉన్నవా?" అని అడిగేశాను.

యీసారి ఆమె అనుమానించకుండా వెంటనే జవాబు చెప్పింది. "ఔను"

యీసమయంలో నేను పరీక్షగా ఆమెను చూశాను. ఆమెరూపం నన్ను ఆకర్షించలేకపోయిందని చెప్పే సాహసంనాకు లేదు; కాకపోతే, నేను వూహించుకొన్న అప్సరసంత బాగాలేదు—అంతే ! ఇక యీమెతో కొంత రొమాన్స్ నడపాలనే వూహ కలిగింది. ఆకట్నం వూహమాత్రమే కాదనేది నిర్ధారణగా తెలిపొయ్యాక - నాస్నేహితుణ్ని అడ్డంపెట్టుకొని కొంతనాటకంఆడి ఆమెను రెచ్చగొట్టాలని నిశ్చయించాను. నా ఆ స్నేహితుడు చాలా విచారంగా వున్నప్పటికీ మంచిమర్యాదలుగల పెద్దమనిషనీ, మరీ అంత బలశాలికాదనీ చిత్రించాను.

ఆమెఉత్సాహంతోనే "బాగా బతికేవారంటే నాకెంతో అభిమానం" అంది.

"నీవు ఆయన్ను చూదొచ్చు; కాని ఇప్పుదేకాదు. ఆయన గ్రామాంతరంలో ఉన్నారు; మూడునాలుగు రోజులకు కాని రారు" అన్నాను.

"అబ్బ ! చెడువార్తగానే వుంది !"

"ఔను—కాదు.... నీవువెంటనే ఇంటికి తిరిగి వెళ్ళాలా ?"

"కానేకాదు"

"ఐతే ఇక్కడన్నేవుండు. కులాసాగా కాలం వెళ్లబుచ్చే విధానం చూస్తాను"

"మీరు చాలా మంచివారండీ!"

"మువ్వెక్కడన్నా హోటల్లో బస చేశావా ?"

ఆమెచెప్పిన హోటల్ మావూళ్ళోకల్లా మంచిది.

"సరే....యీసాయంత్రం నీగౌరవార్థం ఒకవిందుచేస్తాను. స్వీకరించ గోరుతాను"

ఏదో అనుమానంతో ఒక్కక్షణం ఆమె బాధపడి. "సరేలెండి" అంది.

"నేను ఏడుగంటలకల్లా హోటల్‌కు వొస్తాను"

"అలాగే"

ఆతరువాత గుమ్మందాటేవరకూ ఆమెను సాగనంపాను.

అన్నప్రకారం ఏడుగంటలకల్లా ఆమె బసచేసిన హోటల్‌కు వెళ్ళాను. ఆమె ఎంతో అందంగా తయారై నన్ను ఆహ్వానించింది. ఆ దగ్గర్లోవున్న నాకు బాగా పలుకుబడివున్న వేరేహోటల్‌కు—ఆమెను తీసుకొనివెళ్ళి అనేక పదార్థాలతో భోజనం ఆర్డర్ చేశాను. ఒక్కగంట గడిచేప్పటికి మాస్నేహం పెరిగింది. ఆమె తన కథను నాకుచెప్పింది.

ఒక పెద్ద మనిషివల్ల యీమె తల్లి, యీమెను కన్నది; యీమె కర్షకుల మధ్య పెరిగింది. ఇప్పుడు యీమెకు తల్లిదండ్రుల నుంచి పెద్దఆస్థివొచ్చి పడింది. తల్లిదండ్రుల పేరును యీమె చెప్పదలచలేదు.

నేను ఎంత ప్రయత్నించినా, బతిమాలినా, భంగపడినా ఆమె తన తల్లిదండ్రుల పేరును చెప్పలేదు. అడగటం కంఠశోషని వూరుకున్నాను. ఐనా ఇదంత ముఖ్యమైన విషయంగా నాకు కనిపించలేదు. పోతే ఆమె ఆస్థిపాస్థుల్నిగూర్చి కదలేశాను. ఆమెకు బాగా జ్ఞాపకమున్నట్టు—ఆమె ఆస్థివివరాలూ, పెట్టుబడులూ, వడ్డీలకిచ్చిందీ మొదలైన వివరాలన్నీ చెప్పింది. యీవ్యవహారాల్ని ఆమె స్వయంగా చూసుకుంటూన్నందుకు నాకు ఆమెలో గొప్ప నమ్మకం కలిగింది. ఎంతో గొప్పవాణ్ణనుకున్నాను. ఆమె అంటే నాకెంతో ఇష్టమనే విషయాన్ని స్పష్టీకరించాను.

ఆమె ముఖంలోకూడా ఎంతో ఆనందం కనిపించింది. షాంపైన్ ఆమెకు ఇస్తూ, నేనూ తాగాను. ఆమత్తుకు నా అభిప్రాయాలు కొన్ని కలగా పులగమయినవనుకుంటాను. వెంటనే నాకో పెద్ద భయం కలిగింది; నేనూ ఆమేకూడా ఏదో వలలోపడి పోతామేమోననే భయం వెంటాడింది. తీరా నేనామెకోసం ప్రయత్నిస్తే, ఆమె చలించక, నాకు లొంగదేమో? నాలోనే ఒక శాంతి అవసరమై—తిరిగి ఆమె ఆస్థిపాస్థుల సంగతి ఎత్తాను. నాస్నేహితుడు యీ విషయాల్లో చాలా పట్టుదల మనిషనీ, వ్యవహారవేత్త కావటం వల్ల వాడు అన్ని విషయాలూ పూర్తిగా తెలుసుకుంటాడనీ అన్నాను.

ఆమె గర్వంతో అంది: "నాకు తెలుసు. దస్తావేజులు వెంట తీసుకొచ్చాను"

"అలాగా ? అవన్నీ నీ హోటల్‌లో ఉన్నవా ?"

"ఔను"

"వాటిని నాకు చూపగలవా ?

"తప్పకుండా"

"యీ రాత్రి"

"అలాగే"

యీ వ్యవహారమంతా నాకెంతో ఆనందంగా తోచింది. హోటల్ బిల్లు నేనే ఇచ్చాను. ఇద్దరమూ కలిసి ఆమె బసకు వెళ్ళాము. ఆమె ఆస్తిపాస్తుల సర్టిఫికెట్లన్నీ తెచ్చినాకు చూపింది. కళ్ళారా చూసిన నేను వాటిని అనుమానించలేదు. ఉన్నట్టుండి ఒకగొప్ప ఆనందోద్రేకం నన్ను ఆవరించింది; ఒక్కసారిగా ఆమెను కావిలించు కుందామను కున్నాను. అన్నివిధాలా తృప్తి పొందిన వ్యక్తి పవిత్రోద్దేశంతోనే కావిలించుకునే విధానంలోనే ఆమెను కావిలించుకుందామను కున్నాను....నిజానికి ఆమెను కావిలించుకొన్నాను—ఒకసారి, పదిసార్లు....ఆషాంపైన్ తాగిన మత్తులో ఎన్నిసార్లో కూడా జ్ఞాపకంలేదు....ఆమె లొంగిపోయింది.

కాని ఆమె ఏకధారగా ఏడవసాగింది. యీరహస్యాన్ని కాపాడమని ఆమెనన్ను ప్రార్థించింది. నేను వాగ్దానం చేశాను.... యీసమయంలోనే నా మనస్సు మారిపోయింది.

వెంటనేప్లేటుమార్చాను. నాస్నేహితుడి ఆపనమ్మక మనఃప్రవృత్తిని ఆడిపోశాను. ఇంత అవస్థ ఎందుకు పట్టిందంటే వేరే ఆమెకోసమై ఒక స్నేహితుడులేడు; ఆ కాల్పనిక స్నేహితుడు ఏదారిన వొచ్చాడో ఆదేదారిన విరమించవలసిన అవసరం ఏర్పడింది. ఆ స్నేహితుడ్ని నేనే—నేను మోసపోయి, ఆమెను మోసంచేసి యీ అవస్థలో ఇరుక్కున్నాను. ఏమైనా ఆమెనువొదిలేసే వాణ్నేకాని—ఆపాతిక లక్షల ఆస్తి! అది నన్నెంతో ఆకర్షించింది. ఆదీగాక వివాహం చేసుకుందామనుకునే ఆమెను అనుభవించి ఇలా వొదిలెయ్యటం న్యాయమనిపించలేదు; ఆమెమీద ఒకరకం జాలికలిగింది....కాని ఇంత తేలిగ్గాలొంగిపోయిన స్త్రీని వివాహమాడితే, దాంపత్యంలో ఎంతరక్షణ వుంటుందో కూడా ఆలోచించ వలసిన విషయమే!

ఆరాత్రల్లా—అనిశ్చయంగా ఆలోచించాను. యీ గడ్డు సమస్యతో నేనెలా బైటపడటమాఅని ఎంతో బాధపడ్డాను. కాని తెల్లారాక నేను నిశ్చయానికి రాగాలిగాను.

పదకొండింటికల్లా చక్కగా తయారై ఆమెబసచేసిన హోటల్‌కు వెళ్ళాను. నన్ను చూడగానే ఆమె నేలచూపులతో ఎంతో సిగ్గుపడింది.

"మనంచేసినతప్పును సరిదిద్దుకునేందుకు ఒకేవొక్క మార్గంవుంది; వివాహమాడుదాం" అన్నాను.

ఆమెతన అంగీకారాన్ని ఇచ్చింది.

నేనామెను వివాహమాడాను. ఆరేళ్లు సక్రమంగానే గడిచినవి. నేను నా పాత గుమస్తా ఉద్యోగాన్ని వొదిలేసి వ్యాపారం చేయసాగాను. నిజానికి నాభార్యలో ఏలోపమూ కనిపించలేదు.

ఆతరువాత ఆమె అప్పుడప్పుడు దూరప్రదేశాలకు వెళ్ళ రావటాన్ని గమనించాను. యీ వెళ్ళటం అనేది ఒకవారంలో మంగళవారమైతే, ఇంకో వారంలో బుధవారంనాడు జరుగుతూండేది. ఇందులో ఏదో పెద్ద మోసం వుందని, ఆమెను అనుసరించాను.

అది మంగళవారం. ఒంటిగంటకు ఆమె కాలినడకనే రిపబ్లిక్ వీధిగుండా వెళ్ళసాగింది. సంముగొంములు తిరుగుతూ డేటర్స్‌బ్రిడ్జ్ దాటింది. అప్పటినుంచే ఆమెలో పెద్దభయాన్ని నేను గమనించాను. మాటిమాటికీ అటూఇటూ చూడటం, క్షణక్షణానికీ భయపడటం, తనకు ఎదురయే ప్రతి వ్యక్తినీ పరీక్షగా చూడటం—ఇదంతా నాకు అగమ్యగోచరంగావుంది.

బొగ్గుగనిలో పనిచేసేవాడి వేషంవేసుకున్నందువల్ల నన్నామె గుర్తించలేదు. చివరకు ఎడంచేతిమీద వీధిలోకి జొరబడింది. ఒంటిగంటా నలభైఐదునిమిషాల బండిలో ఆమె రంకుమొగుడు దిగుతాడని నేను వూహిస్తున్నాను.

ఒకపెద్ద పెట్టెపైన కూర్చొని గమనిస్తున్నాను. పెద్దకూత—ఒకగుంపు ప్రయాణీకులు. ఆమె గాబరాగా లేచింది. అటూ ఇటూ తిరుగులాడింది. ఒక కర్షకుడితో వున్న మూడేళ్ల పిల్లను దగ్గరికి తీసుకొని ప్రేమతో కావిలించుకుంది. ఆ తరువాత ఇంకోవైపుతిరిగి ఒకనర్సుదగ్గరవున్న అంతకన్న చిన్నబిడ్డను కావిలించుకుంది; యీ బిడ్డ మొగవాడో, ఆడదోకూడా నాకు తెలియలేదు. ఆ తరువాత వారంతా కలిసి క్వీన్స్‌రోడ్డు వైపు వెళ్ళారు.

ఎంతో బాధతో ఇంటికి వొచ్చాను; ఏదో ఆలోచిస్తున్నాను కాని, సరిగ్గా వూహకు చిక్కని విషయమల్లేనే వుంది. ఆమె భోజనానికి వొచ్చినప్పుడు "ఆపిల్లలు ఎవరూ?" అన్నాను.

"ఏ పిల్లలు?" అందామె మొహం చిట్లించి.

"అదే....స్టేషన్‌లో కలుసుకున్నావే ఆపిల్లలు"

ఆమె ఒక్క అరుపు అరిచి మూర్ఛపోయింది. తెలివి వొచ్చాక ఆమె ఏడుస్తూనే తనకు నలుగురు బిడ్డలని వొప్పుకుంది. ఇద్దరు కూతుళ్ళూ మంగళవారం నాడూ, ఇద్దరు కొడుకులూ బుధవారం నాడూ తీసుకురాబడుతూంటారు.

ఇదీ అసలు వ్యవహారం! ఎంతతలవొంపులు! ఆమె యీ ఆస్థిపాస్థులకు ఇదే మూలాధారం! నలుగురు తండ్రిలతాలూకు ఆస్థయివుంటుంది!....నన్ను ఇప్పుడేంచేయమంటారు?"

"అందులో మీ పిల్లలెవరో గుర్తించగలరా?" అన్నాడు న్యాయవాది!

